రోత మాట.. పాత పాట

▸ మొదటిపేజీ తరువాయి...

వ్యక్తమవుతున్నాయి. దాదాపు పదేండ్లపాటు సభానాయకుడిగా కేసీఆర్ ప్రదర్శించిన హుందాతనం, వివిధ పార్టీల ఎమ్మెల్యేల సూచనలను స్వీకరించి తీరు, ఆయా సమయాల్లో విపక్ష ఎమ్మెల్యేలనూ కీర్తించిన సందర్భాలను గుర్తుచేస్తున్నారు. తాజాగా జరిగిన సమావేశాల్లో సభానాయకుడిగా సీఎం రేవంత్‌రెడ్డి సభ్యుల మనోభావాలను, వ్యక్తిగత ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యవహరించారని విమర్శిస్తున్నారు. బడ్జెట్, ద్రవ్య వినిమయ బిల్లు, వివిధ పద్దులపై జరిగిన చర్చల సందర్భంగా సహచర మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కట్టడి చేయాల్సింది పోయి మరింత రెచ్చగొట్టేలా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. 'ఆ అక్కలను నమ్ముకుంటే బతుకు బస్టాండే', 'మీరే స్వయంగా వచ్చి చెప్పుతో కొడతారు' అంటూ రేవంత్‌రెడ్డి చేసిన పలు వ్యాఖ్యలను ఉటంకిస్తూ తప్పుపడుతున్నారు.

సరైన సమాధానాలు లేకనే!

బీఆర్‌ఎస్ అడిగిన ప్రశ్నలకు కాంగ్రెస్ సర్కార్ వద్ద సరైన సమాధానాలు లేకనే సీఎం రేవంత్‌రెడ్డి సహా డిప్యూటీ సీఎం, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దుర్భాషల పర్వానికి దిగారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బడ్జెట్ సమావేశాల్లో మాజీ మంత్రి కేటీఆర్ చేసిన సుదీర్ఘ ప్రసంగంలో ఆయన లేవనెత్తిన అంశాలపై సమాధానం చెప్పలేకనే వ్యక్తిగత విమర్శలకు దిగారని పేర్కొంటున్నారు. బడ్జెట్ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు, పద్దులపై చర్చ సందర్భంగా మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి అడిగిన అంశాలపై సమాధానం చెప్పకుండా ఉద్దేశపూర్వకంగానే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌రాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, దానం నాగేందర్ సహా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దురుసుగా వ్యవహరించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక రేవంత్ సర్కార్ దుర్మార్గంగా వ్యవహరించిందని బీఆర్‌ఎస్ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నది. సభానాయకుడిగా రేవంత్‌రెడ్డి తగడని, ఆయనో అన్‌ఫిట్ సీఎం అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. 'సీనియర్ శాసనసభ్యుడిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పెద్దమనిషి తరహా వ్యవహరించకుండా మరింత అభ్యంతరకరమైన భాషను ప్రయోగించారు' అని విమర్శించారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు దుర్మార్గంగా వ్యవహరించి సభను అగౌరవ పరిచారన్న బీఆర్‌ఎస్ విమర్శలతో ఎంఐఎం నేత, సీనియర్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఏకీభవించారు. సభలో సర్కార్ అనుసరించిన తీరును అక్బరుద్దీన్ ఆక్షేపించారు.



రేవంత్ కవ్వింపు చర్యలకు ఇవీ ఉదాహరణలు

అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుంచీ సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగానే సభను తప్పుదారి పటిస్తున్నారని బీఆర్‌ఎస్ విమర్శిస్తున్నది.

పద్దులపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి 'వ్యవసాయ మోటర్లకు స్మార్ట్ మీటర్లు పెడుతామని బీఆర్‌ఎస్ ప్రభుత్వమే సంతకాలు చేసింది' అని అనడంతో సభలో దుమారం చెలరేగింది. సీఎం ఉద్దేశపూర్వకంగానే 'అదర్ ద్యాన్ అగ్రికల్చర్ కనెక్షన్స్' అనే వాక్యాన్ని వదిలేసి చదివారు' అని అసలు విషయాన్ని బీఆర్‌ఎస్ బయటపెట్టింది.

కాళేశ్వరం విషయంలో రిటైర్డ్ ఇంజినీర్లు ఇచ్చిన సూచనను గత ప్రభుత్వం పట్టించుకోలేదు' అని సీఎం చేసిన వ్యాఖ్యలు సభను తప్పుదారి పట్టించాయని బీఆర్‌ఎస్ అసలు విషయాన్ని బయటపెట్టింది.

పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు విషయంలోనూ సీఎం



రేవంత్‌రెడ్డి సభలో వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పోతిరెడ్డిపాడుకు పొక్కపెట్టి నీళ్లు ఎత్తుకుపోయినప్పుడు పదవుల కోసం పెదవులు మూసుకున్నది బీఆర్‌ఎస్ నాయకులేనని వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధారాలతో తూర్పారబట్టారు.



రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, ఆడబిడ్డలకు రక్షణ కరువైందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సభలో మంగళవారం ప్రస్తావిస్తే బుధవారం 'మీ వెనకాల ఉన్న ఇద్దరు అక్కలు ఇక్కడ ముంచి అక్కడ తేలిండ్లు. ఆ అక్కలను నమ్ముకుంటే జూబ్లీ బస్‌స్టేషనే దిక్కవుద్ది' అని సీఎం రేవంత్‌రెడ్డి అంటే.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 'కాంగ్రెస్ పార్టీ దళితుడిని సీఎల్పీ నేతను చేస్తే పార్టీ మారిన మీరు ఏ ముఖం పెట్టుకొని మాట్లాడుతున్నారు' అంటూ సబితా ఇంద్రారెడ్డిని సీఎంతో పోటీపడి మరీ వ్యాఖ్యానించడం తీవ్ర విమర్శలకు దారితీసింది.

సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై చేసిన వ్యాఖ్యలకు సీఎం, డిప్యూటీ సీఎం క్షమాపణ చెప్పాలని గురువారం జరిగిన సభలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. పోడియం ముందు నిలబడి ఏకధాటిగా నిరసన తెలుపుతున్న తరుణంలో సీఎం మరోసారి మాట మార్చి 'ఆ ఇద్దరు అక్కలు అక్కడ (బీఆర్‌ఎస్‌లో) ఉంటే లాభం లేదు. ఇటు ఉంటే మేం (మంత్రులు సీతక్క, కొండా సురేఖను చూపిస్తూ) గౌరవంగా చూసుకుంటాం. సొంత చెల్లె (ఎమ్మెల్సీ కవిత) జైలుకు వెళ్లినా ఇక్కడ రాజకీయాలు చేస్తుండు (కేటీఆర్‌ను ఉద్దేశించి) అంటూ వ్యాఖ్యానించారు.

అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో నిరుద్యోగులకు హామీ ఇచ్చిందని, సభలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చె ప్పి కేవలం ప్రకటన మాత్రమే చేయటం ఏమిటని శుక్రవారం జరిగిన సభలో బీఆర్‌ఎస్ తప్పుబట్టింది. జాబ్ క్యాలెండర్‌పై చర్చ జరగాలని పట్టుబట్టింది. బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తున్న క్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ 'ఏయ్.. నీ యమ్మా... తోలు తీస్తా కొడకా..బయట తిరగనీయం' అంటూ దబాయించి దుర్భాషలాడటం, అసలు జాబ్‌క్యాలెండర్‌పై చర్చ అవసరమే లేదని సభలో స్టేట్‌మెంట్ చదివేసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బయటికి వెళ్లిపోవటంతో చేసేదేంలేక బీఆర్‌ఎస్ సభ్యులు బయటకు వచ్చి గన్‌పార్క్ వద్ద నిరసన తెలిపారు.

మీడియా పాయింట్‌లోనూ

సభలో సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై సీఎం, డిప్యూటీ సీఎం తీరును నిరసిస్తూ బీఆర్‌ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. వారికి మీడియా పాయింట్ వద్ద మాట్లాడే అవకాశం కూడా లేకుండా కాంగ్రెస్ వ్యవహరించిందనే ఆరోపణలు వచ్చాయి.

ముగ్గురు మహిళా సభ్యులు నిలబడే ఉన్నా

సభలో ముగ్గురు మహిళా సభ్యులు నాలుగున్నర గంటలపాటు నిలబడి నిరసన తెలుపుతున్నా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు స్పందించని రికార్డును తెలంగాణ అసెంబ్లీయే నమోదు చేసి ఉంటుందని సీనియర్ పాత్రికేయుడొకరు వ్యాఖ్యానించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తీరును గతంలో రాజస్థాన్, ఒడిశా సహా పలు రాష్ట్రాలు అభినందించిన విషయాన్ని గుర్తుచేశారు. కామన్‌వెల్త్ పార్లమెంటేరియన్ సదస్సుల్లోనూ తెలంగాణ అసెంబ్లీపై ప్రశంసలు వచ్చిన సందర్భాలున్నాయని, అలాంటి సభ ఈసారి కాంగ్రెస్ ఎమ్మెల్యేల తొడగొట్టడాలు, దుర్భాషల ఉదంతాలతో మసకబారిందని విశ్లేషించారు.

హుందాతనంతో కేటీఆర్.. భేషజంతో రేవంత్‌రెడ్డి

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హుందాతనంతో వ్యవహరించారని, అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి భేషజాలకు పోయారని స్వయంగా కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యేలే వాపోతున్నారు. కేటీఆర్ ప్రసంగంలో రేవంత్ అని ఒక దశలో సంబోధించగా దీనిపై కాంగ్రెస్ సభ్యులు తప్పుబట్టారు. ఒక దశలో స్పీకర్ సైతం సభానాయకుడిని ఏకవచనంతో సంబోధించకూడదని చెప్పడంతో కేటీఆర్ గతంలో తనకున్న చనువుతో అలా అన్నానని, ఒకవేళ తన మాటలు సరికాదని భావిస్తే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నానని ప్రకటించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గుర్తుచేస్తూనే మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలపై పెదవి విరుస్తున్నారు. సభానాయకుడిగా సీఎం హుందాగా వ్యవహరించాల్సిందిపోయి వివాదాలకు కారణమవుతున్నారని కాంగ్రెస సీనియర్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

కేసీఆర్ హుందాతనపు గుర్తులు

సభానాయకుడిగా రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకుల పట్ల కేసీఆర్ ప్రదర్శించిన హుందాతనపు సందర్భాలను అసెంబ్లీ సమావేశాలు జరిగిన ప్రతిరోజూ బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులే కాకుండా కాంగ్రెస్, ఎంఐఎం సభ్యులు కూడా గుర్తుచేసుకున్నారు. ఆయన ఏనాడూ ప్రతిపక్ష నేతలను చులకనగా చూడలేదనీ చెప్పుకొంటున్నారు. 'ఎల్‌వోపీ ప్రస్తావన వచ్చినప్పుడల్లా కేసీఆర్ సహా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలంతా 'పెద్దలు జానారెడ్డిగారు' అంటూ సం బోధించేవారు. ఆయన వ్యక్తిత్వాన్ని ఏనాడూ తూలనాడలేదు. ఒక్క పరుష పదం కూడా ఆయన గురించి మాట్లాడలేదు. ఇక బీజేపీ ఎల్పీ నేతగా ఉన్న లక్ష్మణ్‌ను గౌరవప్రదంగా విద్యాధికుడు అని కేసీఆర్ స్వయంగా ప్రస్తుతించారు. సభలో వాతావరణం వేడెక్కిన ప్రతిసారీ కేసీఆర్ ఇంటిపెద్దగా వ్యవహరించేవారు' అని గుర్తుచేస్తున్నారు. ఇందుకు గతంలో డీకే అరుణ, కేటీఆర్ మధ్య జరిగిన ఘటనను ఉదహరించారు. వారిద్దరి మధ్య మాటల యుద్ధం జరిగినప్పుడు కేసీఆర్ జోక్యం చేసుకొని, ఓ మెట్టు దిగి తన సభ్యుడితో క్షమాపణ చెప్పించారని గుర్తుచేశారు. కేసీఆర్ తనపై వచ్చిన విమర్శలను కూడా హుం దాగా స్వీకరించేవారని చెప్తున్నారు. ఓ సందర్భంలో నాటి బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 'కరీంనగర్‌ను లండన్ చేస్తానని అన్నారు' అని ప్రశ్నించగా 'మీరు చదువుకున్న యువనేత. ఇలా తప్పుడు అన్వయం చెప్పడం సరికాదు' అని చెబుతూనే తాను ఏ సందర్భంలో, ఏ ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేశానో వివరించారని చెప్పారు. సభ్యులు ఏవైనా సమస్యలను ప్రస్తావిస్తే వాటిని నోట్ చేసుకోవడంతోపాటు పరిశీలించాలంటూ సంబంధిత మంత్రికి, అధికారులకు అక్కడికక్కడే సూచనలు జారీ చేసేవారని, నాటి ప్రతిపక్ష ఎమ్మెల్యేలుగా ఉన్న భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ ఇలా ఎవరు సమస్యలను ప్రస్తావించినా పరిష్కారానికి వెంటనే ఆదేశాలిచ్చేవారని చెబుతున్నారు. 108 ఉచిత అంబులెన్స్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను పొగిడి, వాటిని మరింత మెరుగ్గా అమలు చేశారని, సభలో సభ్యులకు గౌరవం ఇవ్వడమే కాకుండా శాసన సభ్యుల పట్ల బయటి వ్యక్తులు చేసే వ్యాఖ్యలపైనా తీవ్రంగా స్పందించేవారని, పెద్దన్న పాత్ర పోషించారని చెప్తున్నారు. కొత్తగా ఎన్నికైన అసెంబ్లీ సభ్యులనుద్దేశించి కొన్ని టీవీ చానళ్లు అవహేళన చేయగా, అసెంబ్లీ వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతిని గుర్తుచేస్తున్నారు. పక్కన ఏపీ అసెంబ్లీ అరుపులు, గొడవలు, దూషణలతో దద్దరిల్లుతూ మీసాలు తిప్పడం తొడలు చరచడం వంటి విన్యాసాలు జరిగేవి. 'పక్కన తెలంగాణ అసెంబ్లీని చూడండి' అని అదే సభలో స భ్యులు నాటి ఏపీ ప్రభుత్వానికి గడ్డిపెట్టిన సందర్భాలున్నాయి. సభా నాయకుడిగా కేసీఆర్ ప్రదర్శించిన తీరుకు ఉదహరణలు ఇలా..

తెలంగాణను నిర్మించుకోవాలి

తెలంగాణ రాష్ట్రం ఎన్నో త్యాగాలు, బలిదానాలు, పోరాటాలు, దీక్షలు, లాఠీ దెబ్బలు, కష్టాలు పడ్డ తర్వాత మనకు సాకారమైంది. సంయమనంతో హృదయపూర్వక విధానంతో అందరం కలసి మనం తెలంగాణను నిర్మించుకోవాలి. మేము ఒక్కరమే చేస్తామని ఒంటెద్దు పోకడ పోదలచుకోలేదు. ఏ పాలసీని రూపకల్పన చేసినా ఖచ్చితంగా అన్ని పార్టీలను పిలిచి కూర్చుని మాట్లాడి చేస్తాం.

- 2014, జూన్ 10న తొలిసభలో కేసీఆర్

మహిళల ఆత్మగౌరవం పెరగాలి

మహిళల గౌరవాన్ని కాపాడవలసిన బాధ్యత మనకు ఉంది. వారికి సమాజంలో రక్షణ ఉండాలి. మహిళల ఆత్మగౌరవం పెరిగే విధంగా నడుచుకోవాల్సిన బాధ్య అందరిపైనా ఉన్నది.

-శాసనసభలో 2014, జూన్ 13న కేసీఆర్

జానారెడ్డి ప్రధాన ప్రతిపక్ష నేతమాత్రమే.. వయసు రీత్యా, అనుభవం రీత్యా ఆయన అందరికీ గౌరవనీయులు. సభలో ప్రతిపక్ష నేతకు సముచిత ప్రాధాన్యం ఉంటుంది. జానారెడ్డికి ప్రాధాన్యత విషయంలో చర్యలు తీసుకుంటాం.

-2014, నవంబర్ 10న కేసీఆర్

సన్నబియ్యం సలహా ఆనాడు ఈటల రాజేందర్ ఇచ్చారు. కమ్యూనిటీ హాల్స్ పర్ ఆల్ కమ్యూనిటీస్. దీనికి పేరు కూడా మా ఈటల రాజేందరే పెట్టారు. డైట్ చార్జీలు రాజేందర్ కోరిక మేరకు పెంచుతున్నాం. రాజేందర్ చెప్పారు కాబట్టి చేయం అని అనొద్దు. కావాలంటే ఆయనకు ఫోన్ చేసి సలహాలు తీసుకోవాలి. రాజేందర్ ఇవ్వాళ ఇక్కడి (బీఆర్‌ఎస్) నుంచి అక్కడికి (బీజేపీ) వెళ్లొచ్చు కానీ అన్నీ తెలుసు.

-2023, ఫిబ్రవరి 23న కేసీఆర్

మరిన్ని సందర్భాలు

- ఖమ్మం జిల్లాలోని రెండు పంచాయతీలకు టెక్నికల్ సమస్య వల్ల రైతుబంధు అందడం లేదని భట్టి విక్రమార్క చెప్పగానే ఆ మేరకు వెంటనే సరిదిద్దాలని సభాముఖంగానే కేసీఆర్ ఆదేశించారు.
- కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఓ అంశం మీద సూచన చేయగానే 'మంచి సూచన చేశారు ధన్యవాదాలు' అని చెప్పి వెంటనే చట్టంలో ఆ మేరకు సవరణ చేయించి సభతో ఆమోదింపజేశారు.
- బడ్జెట్ ప్రసంగంలో కొండా సురేఖ కొన్ని వర్గాల ఇబ్బందులను ప్రస్తావించగానే వెంటనే వారికి కూడా ఆసరా పింఛన్లను కేసీఆర్ ప్రకటించారు.
- ఎస్‌ఎల్‌బీసీ సొరంగం జాప్యం మీద చర్చకు వచ్చినప్పుడు 'నల్గొండ కాంగ్రెస్ నాయకులతో వెంటనే సమావేశం ఏర్పాటు చేసి వారి సూచనల మేరకు అదే కాంట్రాక్టర్‌ను కొనసాగిస్తాం' అని ప్రకటించారు.

అప్పుడూ.. ఎప్పుడూ ఆదర్శం..

- చరిత్రలో తొలిసారి ఒక అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ దాదాపు 3 గంటల పాటు జరిగింది
- **రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి గొర్రెల చేపల పెంపకం దారుల అంశం మీద గంటల పాటు చర్చ కొనసాగింది.**
- ఎప్పుడూ తూతూ మంత్రంగా జరిగే మొక్కల పెంపకంపై తెలంగాణ అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ జరిగింది. రాష్ట్రంలోని ఏ అడవిలో ఏ పరిస్థితి ఉన్నది? ఎంత అరణ్యం ఉండేది? ఇపుడెంత ఉన్నది? దాని విపరిణామాలేమిటి? వంటి చర్చ గతంలో ఏనాడూ జరగలేదు. గత ప్రభుత్వాలను నిందించకుండా భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాల్సిన అవసరం నొక్కి చెబుతూ భారీ లక్ష్యాలను సభ ముందుంచడమే కాకుండా దాన్ని ఎలా సాధించదలిచాము? నిధులెక్కడి నుంచి తెస్తున్నాము? ఎలా అమలు చేయబోతున్నాము? అన్నీ సవివరంగా చర్చించడం ఒక చరిత్ర.
- **రాష్ట్రానికి మేకలు, గొర్రెల మాంసం అవసరమెంత? మనం సమకూర్చుతున్నదెంత? ఎంత బయటినుంచి వస్తున్నది? మనమే స్వయం పోషకం కావడం ఎలా? వంటి చర్చలు గతంలో ఏనాడూ జరగలేదు. ఆ చర్చలోంచి గొర్రెల పంపిణీ పథకం ప్రకటన వచ్చింది.**
- నేత కార్మికుల సమస్యలను అమూలాగ్రం చర్చించింది కేసీఆర్ హయాంలోనే.. ఉద్యమ సమయంలో తాము చూసిన పరిస్థితులను వివరిస్తూ నేత కార్మికుల కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరిస్తూనే ఆ వర్గం ఎమ్మెల్యేలు అందరికీ సూచనలు చేసే అవకాశం కేసీఆర్ హయాంలోనే కలిగింది.
- **ప్రతి బడ్జెట్‌లో గిలిటెన్‌లో నేత, మత్స్య కార్మిక, గొర్రెల పెంపకం, కల్లుగీత వంటి శాఖల పద్దులు గుంపులో గోవిందలా కలిసిపోయి నామమాత్రపు ప్రస్తావనకు మాత్రమే వచ్చేవి. ఎమ్మెల్యేలకు మాట్లాడే అవకాశం కూడా రాకపోయేది. కానీ కేసీఆర్ హయాంలో అన్ని రంగాల వారికి తమతమ వత్తిదారుల సమస్యలు చర్చించి పరిష్కారాలు సూచించి సంతృప్తి చెందే అవకాశం వచ్చింది. అందుకే ఒక మంత్రి 'మా వర్గాలకు నిజమైన స్వాతంత్ర్యం ఇవాళ వచ్చింది' అని వ్యాఖ్యానించారు.**
- ఆఖరుకు గ్రామాల్లో కోతుల బెడద మీద కూడా అసెంబ్లీ సుదీర్ఘంగా చర్చించింది.
- **రాష్ట్ర నీటి వాటాల మీద హక్కుల రక్షణ మీద చర్చలే కాదు, అసెంబ్లీ తీర్మానాలు కూడా చేసింది.**
- హైదరాబాద్ అభివద్ధి మీద కూడా సుదీర్ఘంగా చర్చించింది. ఎస్‌ఆర్‌డీపీ మీద సభ్యుల అభిప్రాయాలు తీసుకున్నది.
- **గత పదేండ్ల కాలంలో ఒక్క సమావేశంలోనూ బూతు మాటలు వినబడలేదు. బెదిరింపులు కనబడలేదు.**
- ప్రతి చర్చా అర్థవంతంగా.. ఒక విజ్ఞానంలా నడిచింది.
- **ప్రతి అంశంలోనూ తెలంగాణతనం ఉట్టిపడేది. ఎర్ర రొయ్యలనుంచి కోతుల బెడద దాకా తెలంగాణ మట్టి వాసన ప్రతిబింబించేది. మధ్యలో సునిశిత హాస్యం, పిట్టకథలు, సామెతలు, సుభాషితాలు పండితుల నుంచి పామరుల దాకా అందరినీ అలరించేవి.**

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	33.9°c	23.5°c
రంగారెడ్డి	32.4°c	21.9°c
ఖమ్మం	32.0°c	24.0°c
నిజామాబాద్	31.2°c	24.5°c
కరీంనగర్	31.0°c	25.0°c
వరంగల్	31.0°c	25.0°c
హైదరాబాద్	30.8°c	24.4°c
నల్లగొండ	30.5°c	24.4°c
మహబూబ్‌నగర్	29.2°c	22.3°c
మెదక్	21.9°c	32.3°c

ఏడుపుగొట్టు ప్రభుత్వం

▸ మొదటిపేజీ తరువాయి...

పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రతిపక్షాల గొంతు నొక్కారని, డిమాండ్లపై రెండు రోజులే చర్చ జరిపారని మండిపడ్డారు. తనకు పద్దులపై మాట్లాడే అవకాశం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ద్రవ్య వినిమయ బిల్లు పూర్తిస్థాయి చర్చ లేకుండా ఆమోదించుకున్నారని తెలిపారు. రేవంత్‌ది ప్రజాపాలన కాదు ప్రతిపక్షాలపై పంజావిసిరే పాలన అని ఎద్దేవా చేశారు. 7 నెలల పాలనలోనే రేవంత్ వికృత చేష్టలు బయటపడ్డాయని వెల్లడించారు. రేవంత్‌రెడ్డి సభానాయకుడిగా కాకుండా, ఆటవిక రాజ్యానికి రాజులా వ్యవహరించారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం మీద ఏడుపు, కేసీఆర్ మీద తిట్ల దండకం కోసం అసెంబ్లీ సమావేశాలు జరిగినట్టు ఉన్నాయని విమర్శించారు. బీఆర్‌ఎస్ సభ్యులు బాగా మాట్లాడుతున్నప్పుడల్లా తప్పుడు పత్రాలతో సీఎం సభకు వచ్చి చర్చను పక్కదారి పట్టించారని ఆరోపించారు. గ్యారంటీలు అని చెప్పి రేవంత్ అధికారంలోకి వచ్చారని, బడ్జెట్‌లో వాటి ఊసే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటి నుంచి నిలదీస్తే తమను రెండు సార్లు మార్షల్స్‌తో బయటకు ఎత్తిపడేశారని తెలిపారు.

అబద్ధాల కోరుగా గిన్నిస్ రికార్డ్

అసెంబ్లీలో సీఎం, డిప్యూటీ సీఎంల అబద్ధాలకు లెక్కే లేదని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం నిండు సభలో అబద్ధాలు ఆడారని గుర్తుచేశారు. ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండానే ఉద్యోగాలు ఇవ్వటం ఎలా సాధ్యమో మేధావులు ఆలోచించాలని సూచించారు. సీఎంగా ఉండి ఇంత పచ్చి అబద్ధాలు ఆడవచ్చా? అని ప్రశ్నించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా తమ ఎమ్మెల్యే హరీశ్‌రావు అప్పుల గురించి చెప్తుంటే సీఎం విద్యుత్తు మీటర్లపై తప్పుడు పత్రం తెచ్చి సభను తప్పుదోవ పట్టించారని తెలిపారు. ఆ అబద్ధాల అలవాటు డిప్యూటీ సీఎం భట్టికి కూడా వచ్చిందని విమర్శించారు. రేవంత్‌ను అతిపెద్ద అబద్ధాల కోరుగా గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కించాలని అన్నారు. రూ.75 కోట్లతోనే సీతారాంసాగర్ ప్రాజెక్టు కింద లక్షన్నర ఎకరాలకు నీళ్లిచ్చామని భట్టి ఘోరమైన అబద్ధం ఆడారని అన్నారు. ఆయనకు నోబెల్ ప్రైజ్ ఇవ్వాలని, భట్టిని ప్రధాని మోదీ తన క్యాబినెట్‌లోకి తీసుకోవాలని ఎద్దేవా చేశారు.

తిట్టేందుకే కాంగ్రెస్ నేతలకు మైక్

కేటీఆర్ ద్రవ్య వినిమయ బిల్లుపై వాస్తవాలు చెప్తుంటే సీఎం జోక్యం చేసుకుని మహిళా ఎమ్మెల్యేలను దూషించి కంటతడి పెట్టించారని వేముల మండిపడ్డారు. నాలుగున్నర గంటలపాటు మహిళాఎమ్మెల్యేలు బతిమిలాడినా మైక్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగదీశ్‌రెడ్డిని తిట్టించేందుకు కోమటిరెడ్డికి రేవంత్ మైక్ ఇప్పించారని తెలిపారు. దానం నాగేందర్ తమతో ఉన్నపుడు బాగానే ఉన్నారని, అటు వెళ్లగానే సీఎంలాగే బూతులు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పైగా, దానం మాటలను రేవంత్ సమర్థించేలా మాట్లాడటం సిగ్గు చేటు అని అన్నారు.

రూ.4 వేలు లేవుకానీ రూ.1.50 లక్షల కోట్లు ఎక్కడివి?

'ఆసరా పెన్షన్లను రూ.4 వేలు చేయటానికి పైసల్లేవు అని సీఎం అంటున్నారు. మరి మూసీకి రూ.లక్షా 50 వేల కోట్లు ఎక్కడివి?' అని రేవంత్‌ను ప్రశాంత్‌రెడ్డి నిలదీశారు. కేసీఆర్ సలహాదారులను నియమించుకుంటే తప్పుబట్టిన రేవంత్.. ఇప్పుడు ఎందుకు నియమించుకుంటున్నారని ప్రశ్నించారు. 'ఎవడబ్బ సొమ్మని రేవంత్‌రెడ్డి సలహాదారులను నియమించుకున్నారు? ఎవడబ్బ సొమ్మని ప్రభుత్వ ప్రకటనలకు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నవ్?' అని ధ్వజమెత్తారు. పంజాబ్‌లో రైతులకు కేసీఆర్ సాయం చేస్తే తప్పుబట్టారని, ఈ రోజు వయనాడ్‌కు ఎందుకు ప్రభుత్వ ఖజానా నుంచి డబ్బులు పంపుతున్నావ్? అని సీఎంను ఏకిపారేశారు. కావాలనుకుంటే కాంగ్రెస్ పార్టీ నిధుల నుంచి సాయం చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసు రాజ్యం

ప్రజాపాలన కాదు.. రాష్ట్రంలో పోలీసు పాలన

- **ప్రజాహక్కులపై ప్రభుత్వం ఉక్కుపాదం**
- **ఖాకీలతో గొంతు నొక్కేస్తున్న సర్కార్**
- **ఎవరు పర్యటించినా ముందస్తు అరెస్టులే**
- **పోరాటాలపై పోలీసుల నిర్బంధకాండ**
- **నియంతృత్వ పోకడలతో కక్షసాధింపు**



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/(స్పెషల్ టాస్క్ బ్యూరో), ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): 8 నెలల రేవంత్ పాలనలో పోలీసుల నిర్బంధకాండ నిత్యకృత్యమైంది. నిరుద్యోగ, ఉద్యోగవర్గాలను గడప దాటకుండానే అరెస్టు చేయడం ఒకవంతైతే, రోడ్లమీదకు వచ్చిన వారిని నిర్దాక్షిణ్యంగా ఈడ్చుకుంటూ పోలీసు వాహనాలు ఎక్కించి ఠాణాలకు తరలించడం మరోవంతు. డీఎస్సీ అభ్యర్థుల్లో మహిళలు అని కూడా చూడకుండా ఓయూ క్యాంపస్‌లో పరిగెత్తించి మరీ అరెస్టు చేయడం, ఓయూ యువకుడిపై పిడిగుద్దులు, వ్యవసాయ వర్సిటీ విద్యార్థిని జుట్టు పట్టుకొని లాగిన హృదయ విదారక దృశ్యాలు తెలంగాణ సమాజం కండ్ల ముందు కదలాడుతూ ఉన్నాయి. గ్రూప్-2, 3 పోస్టుల సంఖ్యను పెంచి పరీక్షలను వాయిదా వేయాలని, మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్‌చేస్తూ నిరుద్యోగ యువత చేపట్టిన ఆందోళనలపై పోలీసులు అణచివేత చర్యలకు దిగారు. రోడ్డు మీద కనిపించినవారిని కనిపించినట్టు ఈడ్చుకెళ్లి పోలీసు వాహనం ఎక్కించారు. రైతులు, జర్నలిస్టులు అని కూడా చూడకుండా ఠాణాలకు తరలించారు. కోఠిలో ఆశావర్కర్ల ఆందోళనలను అడ్డుకొన్నారు. తమ సమస్యలపై సీఎంను కలిసి గోడు చెప్పుకొంటామన్న గురుకుల అభ్యర్థుల అభ్యర్థనను అణిచివేశారు. అసెంబ్లీ ముట్టడికి వచ్చిన సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా స్టేషన్లకు తరలించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల గొంతు నొక్కే చర్యలకు దిగారు. తమ డిమాండ్ల సాధనకు 'చలో అసెంబ్లీ'కి పిలుపునిచ్చిన మధ్యాహ్న భోజన కార్మికులపై కర్కశత్వం ప్రదర్శించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీకి వెళ్లి విజ్ఞప్తి చేయాలనుకొన్న పెద్దపల్లి ఆటోడ్రైవర్లను కమాన్‌పూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.డిమాండ్ల సాధన కోసం ధర్నాకు బయల్దేరిన పంచాయతీ కార్మికులను ధర్మారం మండల కేంద్రంలో అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న సీఆర్పీలను అర్ధరాత్రి అనిచూడకుండా మంథని పోలీసులు అరెస్ట్ చేశారు. సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టర్ల ముట్టడికి వెళుతున్న సీఐటీయూ నాయకులను అరెస్ట్ చేశారు. బొగ్గు గని బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని చలో హైదరాబాద్ చేపట్టిన కార్మిక సంఘాల నాయకులను అరెస్టు చేశారు. జీపీ కార్మికులు, ఆశాకార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ చేపట్టగా, కార్మికులు, వామపక్ష సంఘాల నాయకులను అరెస్టు చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 31న చలో అసెంబ్లీ చేపట్టగా 30న రాత్రికి రాత్రే మిడ్ డే మీల్స్ కార్మిక సంఘాల నాయకులను అరెస్టు చేశారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లో బీజేవైఎం చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని, మున్సిపల్ కార్మికులు చేపట్టిన ఆందోళనలపై ఉక్కుపాదం మోపిన పోలీసులు ఎక్కడివారిని అక్కడే అరెస్టు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో చేపట్టిన నిరుద్యోగుల ధర్నాను అడ్డుకొని 70 మందిని వాళ్ల ఇండ్లల్లోనే అరెస్టు చేశారు. చలో హైదరాబాద్ చేపట్టిన 40 మంది ఆశా కార్యకర్తలను, 60 మంది మధ్యాహ్న భోజన నిర్వాహకులను వారి ఇండ్లవద్దే అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. జగిత్యాలలోని నిరుపేదలకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేయాలని నిరసనకు పిలుపునిచ్చిన సీపీఎం నాయకులను అరెస్టుచేశారు. వరంగల్‌కు సీఎం సహా మంత్రులు వచ్చిన సమయంలో పోలీసులు ముందస్తుగా నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులను నిర్బంధించారు. సీఎం పర్యటన ముగిసే వరకు పోలీసు స్టేషన్లలోనే ఉంచారు. దళితబంధు కోసం దళిత నేతలు కామారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడించాలనుకొంటే ఉక్కుపాదం మోపారు. పాలబిల్లుల కోసం రోడ్డెక్కిన కోటగిరి పాడిరైతుల నిరసనలను అడ్డుకొన్నారు. వడ్లు కొనాలంటూ కామారెడ్డి మార్కెట్‌లో ఆందోళనలు చేసిన రైతులపై, వరికి బోనస్ ఇవ్వాలన్న బీఆర్‌ఎస్ నేతల నిరసనలపై ఉక్కుపాదం మోపి అరెస్టులు చేశారు. ఇవి ప్రస్తుతం తెలంగాణలో కొనసాగుతున్న పోలీసు రాజ్యానికి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ నిర్బంధకాండను చెప్తూపోతే ఆ జాబితాకు అంతు ఉండదు.

హాట్‌టాపిక్ శాంతిభద్రతలే

శాసనసభ, మండలి సమావేశాలో విస్తృత చర్చ

ప్రభుత్వ, పోలీసుల పనితీరును ఎండగట్టిన విపక్షాలు

- **పదేండ్ల పరిస్థితులను ఉదహరిస్తూ విమర్శనాస్త్రాలు**
- **కొత్త క్రిమినల్ చట్టాలపై వైఖరి చెప్పని ప్రభుత్వం**
- **లైంగికదాడులు, మహిళల భద్రతపై ఎమ్మెల్యేల ఆందోళన**

హైదరాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో గాడితప్పిన శాంతిభద్రతలపై చర్చతో ఇటు శాసనసభ, అటు శాసన మండలి దద్దరిల్లిపోయాయి. 9రోజులపాటు జరిగిన సమావేశాల్లో రెండు రోజుల పాటు ఈ అంశంపై ఉభయసభల్లో హాట్‌హాట్ చర్చ జరిగింది. పదేండ్లలో ఒక్కటంటే ఒక్క అవాంఛనీయ ఘటన జరగలేదని, కేవలం ఆరు నెలల్లోనే శాంతి భద్రతలు అదుపుతప్పి నేరాలు పెరిగిపోయాయని విపక్షాలు మండిపడ్డాయి. శాంతి భద్రతలపై చర్చకు పట్టుబట్టడంతో తగిన చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ పెద్దలు చెప్పారు తప్ప ఆరునెలల్లో జరిగిన హత్యలెన్ని? లైంగికదాడులెన్ని? దోపిడీల, దొంగతనాలెన్ని? వైట్ కాలర్ మోసాలు ఎన్ని? ఎస్సీ, ఎస్టీలపై జరిగిన నేరాలెన్ని? అరికట్టేందుకు ఏం చర్యలు తీసుకున్నారనే విషయాలను సవివరంగా సభ్యులకు తెలియజెప్పలేదు. ఆర్నెళ్ల నుంచి రోజూ రాష్ట్రంలో హత్యలు జరుగుతున్నాయని, ఒక్కో రోజు నాలుగైదు లైంగికదాడి కేసులు నమోదయ్యాయని, రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయా? అంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి వంటి వారు అధికార పక్షాన్ని నిలదీశారు. రాత్రి పదిగంటలైతే హైదరాబాద్‌లో పోలీసు రాజ్యం నడుస్తున్నదని, రోడ్డున వెళ్లేవారిని సైతం ఇష్టారీతిన కొడుతున్నారని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తంచేశారు.

కొత్త క్రిమినల్ చట్టాలపై వైఖరేంటి?

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ఏమిటో చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభలో డిమాండ్ చేశారు. ఇంతకు మునుపే ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. కొత్త క్రిమినల్ చట్టాల్లోని పలునిబంధలు, సెక్షన్లు ప్రజల హక్కులు, స్వేచ్ఛను హరించేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోరాటాల గడ్డ అయిన తెలంగాణలో ధర్నాలు చేసుకునేందుకు కూడా ఎన్నో అడ్డంకులు ఉన్నాయని తెలిపారు. కొత్త చట్టాల ప్రకారం ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేయడం నేరమని, ఇది అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాటం చేసే పౌరులకు ప్రమాదకారిగా మారుతుందని చెప్పారు. గతంలో ఉన్న 15 రోజుల పోలీసు కస్టడీ ఇప్పుడు 90 రోజులకు పెంచారని, ఆగడువులో ఎన్ని సార్లయినా కస్టడీలోకి తీసుకునే అవకాశం కల్పిస్తున్నదని, తద్వారా నిందితుడికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినా పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశముంటుందని తెలిపారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కొత్త క్రిమినల్ చట్టాలపై సమీక్ష చేసి సవరణలు ప్రతిపాదించాయని, తెలంగాణ ప్రభుత్వ వైఖరి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్త చట్టాలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి శ్రీధర్ చెప్పారు.